పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి

● ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

చివ్వెంల, ఫిబ్రవరి 12: పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణాన్ని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవితో కలిసి సందర్శించారు. జాతరకు భక్తులు వచ్చిపోయే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జాతర ప్రారంభమయ్యే 16వ తేదీ నుంచి జాతీయ రహదారి 65పై వాహనాల మళ్లింపు ఉంటుందని తెలిపారు. జాతరకు 2000 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, 68 సీసీ కెమెరాలతో నిఘా పెడుతున్నట్లు తెలిపారు. దొంగతనాలు జరుగకుండా పోలీస్ స్పెషల్ టీమ్స్,సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది, టెక్నికల్ టీమ్స్, క్రైమ్ కంట్రోల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రతకు షీటీమ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సీఐలు రాజశేఖర్, శ్రీను, రఘువీర్, వీరరాఘవులు, ఎస్ఐలు మహేశ్, సాయిరాం, శ్రీకాంత్, బాలునాయక్, వీరయ్య, కనకరత్నం,సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీకి డీజీపీ అభినందన

సూర్యాపేట టౌన్: ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పాల్గొన్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ టేబుల్ టెన్నిస్ విభాగంలో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ బుధవారం తన కార్యాలయంలో ఎస్పీకి మెడల్, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

పోలీస్ క్రీడాకారులకు ఎస్పీ అభినందన

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో మహిళా విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో సూర్యాపేట జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎన్.దీపిక (ఆత్మకూర్.ఎస్ పీఎస్), ఎస్‌కే.హనీఫా, సీహెచ్.శిరీష, సీహెచ్.లత, ఎం.మౌనిక, డి.మౌనిక, బి.ప్రియాంక, ఎం.త్రివేణి (ఏఆర్ సూర్యాపేట), ఎం.శిరీష (పాలకవీడు పీఎస్), జి.శ్రీలత (నేరేడుచర్ల పీఎస్), కె.లావణ్య (తిరుమలగిరి పీఎస్), ఎస్‌కే.సల్మా (నాగారం పీఎస్)ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ నివాళి

సాయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల, ఫిబ్రవరి 2: మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మిట్టగణుపుల వీరబాబు నానమ్మ సాయమ్మ ఇటీవల మరణించారు. బుధవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వీరబాబు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు తొగరు రమేశ్, అజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, సోమిరెడ్డి వీరారెడ్డి, నాగిరెడ్డి లింగయ్య, పుల్లయ్య, మంగయ్య, రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి : డీఎస్పీ

పోలీస్ సిబ్బంది కిట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 12: కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, స్టేషన్ పరిసరాలు, పోలీసు కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ టి.రాము, ఎస్ఐలు రంజిత్‌రెడ్డి, లింగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టిని తరలించొద్దు : మైనింగ్ ఆర్ఐ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని ఎర్రగట్టుతండా శివారులో గత కొన్ని రోజులుగా మట్టి దందా సాగుతున్నది. అనుమతులు లేకుండా జేసీబీలు, టిప్పర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో మైనింగ్ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ ఆర్ఐ వసుమతి బుధవారం అక్కడకు వచ్చి అనుమతులు లేకుండా మట్టిని తరలించొద్దని హెచ్చరించారు. వెంటనే మట్టి తరలింపును ఆపాలని సూచించారు. జేసీబీ, టిప్పర్ల వివరాలను నమోదు చేసుకున్నారు.

చెరువు కట్ట రివిట్‌మెంట్ పనుల పరిశీలన

ఊర చెరువు కట్ట రివిట్‌మెంట్ పనులను పరిశీలిస్తున్న డీఈ స్వర్ణ, ఏఈ మానస

చిలుకూరు, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని నారాయణపురం ఊర చెరువు కట్ట రివిట్‌మెంట్ పనులను ఇరిగేషన్ డీఈ స్వర్ణ, ఏఈ మానస బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది రోజుల్లో చెరువు కట్ట మరమ్మతు పనులు పూర్తవుతాయని తెలిపారు. పనులను నాణ్యతతో పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి విఫలం'

చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని అన్నారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్‌తో పాటు కునుకుంట్ల సైదులు, వి.నర్సింహారావు, ఉదయగిరి, పోలెబోయిన కిరణ్, దేశోజు మధు, సింహాద్రి పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలి'

మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు యాకూబ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 12: గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ దోసపాడు భిక్షం, మండల కమిటీ సభ్యులు బొల్లేపల్లి శ్రీనివాస్, తుమ్మల సైదయ్య, భూతం నాగరాజు, సోమయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మేళ్లచెర్వు: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తాత్కాలికంగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జాని, బాలు, ఎల్లయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది
★ దుడుకు బక్కమ్మ, W/o. (లేట్) దుడుకు సత్తయ్య, R/o. గ్రా|| చామలోనిబావి, మం|| గుర్రంపోడు, జి|| నల్లగొండ అను నా యొక్క డాక్యుమెంట్ నెం: 87/2007 పోయినది. దొరికినవారు సంప్ర|| 6302299420.
NT-000000

GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059

యువతిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 12: తనను ప్రేమించడం లేదని యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా మోటమర్రి గ్రామానికి చెందిన ఓ యువతి గత మూడు నెలలుగా హుజూర్‌నగర్‌లో తన మేనమామ ఇంటి వద్ద ఉంటూ కోదాడ రోడ్డులోని దీపెన్ ఏఐ ఆఫీస్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నది. గతంలో పరిచయం ఉన్న తన గ్రామానికి చెందిన సుందర్ ప్రమోద్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం సమయంలో బాధితురాలికి ఫోన్ చేసి మాట్లాడాలని ఆఫీస్ నుంచి బయటకు పిలిచాడు. ఆమె రాగానే తనను ఎందు కు ప్రేమించడం లేదని యువతితో గొడవ పడి తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లోని పెట్రోల్‌ను యువతిపై చల్లాడు. వెంటనే స్థానికులు గమనించి యువకుడికి దేహశుద్ధి చేశారు. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మీ సేవ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం

అర్వపల్లిలోని శ్రీరామ మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం గఫార్

అర్వపల్లి, ఫిబ్రవరి 12: మండల కేంద్రం అర్వపల్లిలోని మీ సేవ కేంద్రాలను ఈడీఎం గఫార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులపై మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

'ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'

సూర్యాపేట టౌన్: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 12: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దోసపాటి గోపాల్ అన్నారు. లయన్స్ కంటి ఆసుపత్రి, లయన్స్‌క్లబ్ సూర్యాపేట సహకారంతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని 45వ వార్డు విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గండూరి కృపాకర్ మాట్లాడుతూ.. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, నూకల వెంకటరెడ్డి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, మీలా వంశీ, వెంపటి శబరీనాథ్, బండారు రాజా, కుమ్మరికుంట్ల లింగయ్య, బావుసింగ్, నూకా వెంకటేశంగుప్తా పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్‌లో వైద్య శిబిరం..

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సేవా సమితి ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, అధ్యక్షుడు ఎస్‌కే.సైదులు, బత్తుల దామోదర్‌రెడ్డి, పోరండ్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓను సందర్శించిన విదేశీ శాస్త్రవేత్తలు

ఎఫ్‌పీఓలో విదేశీ శాస్త్రవేత్తలు

కట్టంగూర్, ఫిబ్రవరి12 : మండలంలోని గంగాదేవిగూడెం రైతు ఉత్పత్తిదారుల కంపెనీని బుధవారం దక్షిణ అమెరికా, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు. నిమ్మ స్టోరేజీ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్, సోలార్ డ్రయ్యర్, ఇంటిగ్రేటెడ్ ప్యాకింగ్ గురించి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంట ఉత్పత్తులను ఎఫ్‌పీఓలో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. వారి వెంట నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, ఐఆర్‌డీఎస్ రమేశ్, ఎఫ్‌పీఓ సలహాదారులు నంద్యాల నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నరేశ్

మఠంపల్లి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేశ్ మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 13 ఎంపీటీసీ, 1 జడ్పీటీసీ స్థానానికి గాను 69 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని పాతర్లపహాడ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతర్లపహాడ్, ముక్కుడు దేవులపల్లి, బోరింగ్‌తండా, ఇస్తాళాపురం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆల్ పార్టీ మీటింగ్

తిరుమలగిరి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లాజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని, పార్టీల నాయకులు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పాల్గొనాలని కోరారు.

నేరేడుచర్ల: త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల జాబితాపై చర్చించడానికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు సకాలంలో హాజరై పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈ నెల 14 వరకు తెలియజేయాలని సూచించారు. ఈ నెల 15న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా సామగ్రి వితరణ

మఠంపల్లి, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని లాలితండా గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి అయ్యప్ప అనే వ్యక్తి బుధవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రంజాన్, భూక్య బాలునాయక్, రంగానాయక్, రవీందర్, బాబు, శంకర్, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీశైలం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

అర్వపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మంపాటి శ్రీశైలం తండ్రి రామచంద్రు ఇటీవల మరణించారు. శ్రీశైలంతో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు బుధవారం వారి కుటుంబానికి రూ.8,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కేసాని నరసింహారావు, తుంగపాటి నర్సయ్య, కమ్మంపాటి రవీందర్, శ్రీశైలం, నిశాంత్, చందు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి..

సూర్యాపేట టౌన్: సూర్యాపేట పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్ కాసర్ల నర్సయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.దీంతో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలోబుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో షేక్ మహిమూద్‌లీ, నబీ, షఫీ, బరిశెట్టి సోమయ్య, శ్రీనివాస్, పోరెడ్డి విఠల్‌రెడ్డి, గంజి రవి, గంద్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో ఫ్లెక్సీల తొలగింపు

కోదాడలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఫ్లెక్సీ తొలగించిన తర్వాత..

కోదాడ రూరల్, ఫిబ్రవరి 12: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎక్కడా కూడా ప్రభుత్వ పథకాలు, ప్రజాప్రతినిధులకు సంబంధించి ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, కటౌట్లు ఏర్పాటు చేయకూడదు. అయితే, కోదాడలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కటౌట్లు, ఫ్లెక్సీలు అలాగే దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించకపోవడంపై బుధవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'కోదాడలో కోడ్ ఉందా..లేదా? అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు వాటిని తొలగించారు.

నాటుసారా తయారీ స్థావరంపై పోలీసుల దాడి

బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 12: మండల పరిధి నూర్జహాన్‌పేట గ్రామంలోని గుట్టల్లో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ కస్తాల గోపికృష్ణ దాడులు నిర్వహించారు. 30 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ ఐలయ్య

నాగారం, ఫిబ్రవరి 12: సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ఫణిగిరి గ్రామంలోని మేరీ మదర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం ఎస్ఐ ఐలయ్య మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు వ్యక్తిగత వివరాలు అడిగితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ మంజులత

నూతనకల్, ఫిబ్రవరి 12: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులందరూ తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం'

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అఖిల్‌కుమార్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నేటికీ విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా విద్యారంగాన్ని గాలికొదిలేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక విక్రమ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకొంటున్నదన్నారు. గురుకుల విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మాతంగి విజయ్, వంటికొమ్ము నగేశ్, సాయికిరణ్, నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లివాసికి డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న నాగయ్య

మఠంపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన బైరి నాగయ్య బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆచార్య గోనానాయక్ పర్యవేక్షణలో జానపద గేయాలలో సామాజిక జీవన చిత్రం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. నాగయ్య ప్రస్తుతం గరిడేపల్లి మండలంలోని కల్మల్‌చెర్వు హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న అశోక్

నూతనకల్, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు అశోక్ చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మూడ్ మోహన్‌నాయక్, మరికంటి అశోక్, వినోద్‌నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.